

ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్‌బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్‌శారీస్, లేడీస్ ప్యాన్సీటాప్స్, డిజైనర్ బ్లౌస్, లక్నోచికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి టాయ్స్ ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్నివర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 9 వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని అక్బర్‌అలీ పేర్కొన్నారు.



ఎంపీ ఈటలకు సమస్యను వివరిస్తున్న సురేందర్‌యాదవ్, సీ-బ్లాక్ ఓనర్స్

సహభావన టౌన్‌షిప్ సీ-బ్లాక్‌లో నెలకొన్న సమస్యను పరిష్కరించండి

మన్సూరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని సహభావన టౌన్‌షిప్ సీ-బ్లాక్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ కోరారు. సీ-బ్లాక్ ఓనర్స్‌తో కలిసి శనివారం ఈటలను కలిసిన చింతల ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్‌యాదవ్ మాట్లాడుతూ సీ-బ్లాక్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పాటు వాటర్ బిల్లు సమస్య కూడా ఉందన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ మూడు రోజుల్లో జల మండలి ఎండీని కలిసి సమస్య పరిష్కారం అయ్యేలా కృషిచేస్తానని, అదేవిధంగా తాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని సీ-బ్లాక్ వద్ద మూడు బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చినట్లు చింతల పేర్కొన్నారు. కార్యక్రమంలో సీ-బ్లాక్ ఓనర్స్ నల్ల మునీందర్, వైల రాజశేఖర్, వెంకట్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు జ్యూట్ ఉత్పత్తుల తయారీలో శిక్షణ

సరూర్‌నగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ 9వ డివిజన్ పరిధిలో గల సాయిరాంనగర్ కాలనీలో మహిళలకు జ్యూట్ ఉత్పత్తుల తయారీలో శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. శనివారం కార్పొరేటర్ నిమ్మల సునీత హాజరై సదరు తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ తరగతుల్లో మహిళలకు జ్యూట్ ఉత్పత్తుల తయారీతో పాటు టైలరింగ్‌లోనూ శిక్షణ ఇవ్వనున్నారని అన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ రామ్మోహన్, స్వప్న, నవ్య, శిక్షకురాలు కె.పద్మావతి, శ్రీలక్ష్మి, అర్చన పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌కు చెందిన ఎం.తరుణ్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ హాస్పటల్‌లో చేరి చికిత్స పొందారు. వైద్యానికి అధిక మొత్తంలో ఖర్చుకావడంతో మధుయాష్కీగౌడ్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.60వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు శనివారం వనస్థలిపురంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహయాదవ్, నాయకులు ఉమేష్‌గౌడ్, షేక్ షకీర్, ఖదీర్ పాల్గొన్నారు.

కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని గాయత్రినగర్ ఫేజ్-3 నూతన కమిటీ సభ్యులు శనివారం కార్పొరేటర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో మౌలిక సదుపాయాలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాజుగౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి శంకర్, రాజేందర్‌గౌడ్, మురళి, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నాలుగేళ్లు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న విశ్రాంత చీఫ్ ఇంజనీర్ నాగభూషణరావు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ పరిధిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత చీఫ్ ఇంజనీర్ డాక్టర్ నాగభూషణరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. నాలుగేళ్లు కష్టపడి చదివితే ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. పీవీ కృష్ణమూర్తి మాట్లాడుతూ నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఓడీ కిరణ్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో సమగ్ర కుటుంబ సర్వే స్టిక్కరింగ్

చాదర్‌ఘాట్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటింటి స్టిక్కరింగ్ శనివారం కూడా కొనసాగింది. ఈనెల 6న ప్రారంభమైన స్టిక్కరింగ్ నాలుగో రోజు కూడా కొనసాగింది. మరో రెండు రోజులు జరగవచ్చని జీహెచ్‌ఎంసీ అధికారులు భావిస్తుండగా గణాంకాల ప్రకారం జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలోని 73,800ల కుటుంబాలకు గాను 73.54శాతం శుక్రవారం సాయంత్రానికి పూర్తయినట్లుగా చెబుతున్నారు. ఇక శనివారం ఏ మేరకు స్టిక్కరింగ్ జరిగిందో అనే లెక్కలు తెలియరాలేదు. మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో 73,800 కుటుంబాలు ఉన్నట్లుగా గుర్తించిన అధికారులు ఆయా ఇళ్లకు స్టిక్కరింగ్ వేయడం, కుటుంబీకుల నుంచి వివరాలు సేకరించేందుకు గాను 492 మంది ఎన్యూమరేటర్లను ప్రత్యేకంగా నియమించారు. వీరి పనితీరును నిరంతరం పర్యవేక్షించడానికి మరో 49 మంది సూపర్‌వైజర్లను నియమించారు. జీహెచ్‌ఎంసీ సిబ్బందితోపాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను సమగ్ర కుటుంబ సర్వే కోసం ప్రత్యేకంగా నియమించారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పొంచి ఉన్న ముప్పు

- శిథిలావస్థకు చేరుకున్న భవనం కిందనే ఆడుకుంటున్న విద్యార్థులు
- మౌలిక సదుపాయాలకు దూరంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల
- సంఘటన జరిగిన తర్వాత కూడా తేరుకోని అధికారులు

హయత్‌నగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అధికారుల పర్యవేక్షణ లోపం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు అందక సమస్యలు తిష్ట వేస్తున్నాయి. ప్రమాదం పొంచి ఉందని తెలిసి కూడా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత వచ్చి పరామర్శించడం, హడావుడి చేయడం అధికారులకు, పాలకులకు షరా మాములుగా మారిందని ప్రజలు అంటున్నారు. గత సోమవారం హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ప్రమాద వశాత్తు పాఠశాల గేటు వెల్డింగ్ ఊడిపోయి విద్యార్థి అజయ్‌పై పడి మృతిచెందిన సంఘటన తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న ప్రమాదకర పరిస్థితులు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకోవాల్సిన అవసరం విద్యాధికారులకు ఉంది. కానీ విద్యాధికారులు అలా చేయకుండా కార్యాలయాలకే పరిమితమై ప్రభుత్వ చదువును గాలికి వదిలి వేసినట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో అనేక ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థకు చేరుకున్న భవనాలు నేటికి సాక్షాలుగా ఉన్నాయి. విద్యార్థులు అక్కడే, వాటి కింద పక్కన ఆడుకుంటున్నారు. అవి ఏ సమయంలోనైన కూలిపోయి ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అయినా అధికారులు వాటిని కూల్చకుండా వదిలివేశారు.



అన్మగల్ హయత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉన్న పాత ఆస్పత్రి భవనం



మూత్రశాలలు, మరుగుదొడ్లకు విరిగిన తలుపులు

అన్మగల్ హయత్‌నగర్ ప్రైమరీ స్కూల్‌లో శిథిలావస్థ భవనం



అన్మగల్ హయత్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాల

అన్మగల్ హయత్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణకు తరలించిన తర్వాత అక్కడ ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. అంత వరకు బాగానే ఉంది. అప్పటి పాత ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. దాదాపు 80 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం కావడంతో వర్షాలకు తడిసి ఎక్కడికక్కడ కూలిపోతుంది. ప్రతి రోజు విద్యార్థులు దాని కిందనే ఆడుకుంటున్నారు. ఉపాధ్యాయులు ఎంత వారించిన చిన్న పిల్లలు దాని కిందనే ఆడుకుంటున్నారు. ఏదైన అనుకోని సంఘటన జరిగితే తీవ్ర ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది.

శిథిలావస్థ భవనాలు ఉంటే తీయిస్తాం

మండలంలో శిథిలావస్థ భవనాలు ఉన్నట్లు నా దృష్టికి రాలేదు. ఎక్కడైనా ఉంటే తీయిస్తాం. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల చేత పాత భవనం నాణ్యతను పరిశీలించి వాటిని తీయిస్తాం.
- శ్రీనివాస్, మండల విద్యాధికారి, హయత్‌నగర్

అడవిని తలపిస్తున్న ఆట స్థలం

అన్మగల్ హయత్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలోని ఆట స్థలంలో పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగి అడవిని తలపిస్తుంది. చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన జూల, జారుడు పరికరం చుట్టు పిచ్చిమొక్కలు మొలవడంతో విద్యార్థులు వాటిని ఉపయోగించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. పాఠశాల పరిసరాలలో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు, అపరిశుభ్రత పరిసరాలు దర్శనం ఇస్తున్నాయి.

కంపుకొడుతున్న మూత్రశాలలు

పాఠశాలలో ఏర్పాటు చేసిన మూత్రశాలకు, మరుగుదొడ్లకు సరైన నీటి వసతి లేకపోవడంతో అవి కంపు కొడుతున్నాయి. జీహెచ్‌ఎంసీ వారు రోజు విడిచి రోజు ట్యాంకర్ ద్వారా అందిస్తున్న నీరు సరిపడక విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందిపడుతున్నారు. బాత్‌రూం తలుపులు పగిలిపోయాయి. మరుగుదొడ్లు శుభ్రంచేసే వారు లేక పరిసరాలు కంపుకొడుతున్నాయి. పాఠశాల ఆవరణలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది ఊడ్చమని ప్రాధేయ పడినా ఊడ్చడం లేదని పలువురు తెలిపారు. 107మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో కేవలం ముగ్గురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు.

డ్రైనేజీ అవుట్‌లెట్ పనులు త్వరితగతిన పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు కాలనీల డ్రైనేజీ అవుట్‌లెట్ పనులు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు కాలనీల డ్రైనేజీ అవుట్‌లెట్ కోసం సాహెబ్‌నగర్ గ్రామ రైతులతో శనివారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ కాంప్లెక్స్ నుంచి వచ్చే వరదనీటిని కాప్రాయ్ చెరువులోకి రాకుండా గుర్రంగూడ ఫారెస్ట్ నుంచి విపశ్యన ధ్యానకేంద్రం మీదుగా దిగువన ఉన్న శ్రీగాయత్రినగర్, పావిరెడ్డికాలనీ, క్రిస్టల్ విల్లాస్ మీదుగా తీసుకెళ్లి మునగనూర్ మీదుగా అంబర్‌పేట్ శివారులో కలపాలని ప్రణాళికలు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఈ ట్రంక్‌లైన్ పనులు ఆగిపోవడం జరిగిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రజా అవసరాలను గుర్తించి 21 కాలనీల డ్రైనేజీ సమస్య ట్రంక్‌లైన్ కోసం మీ పొలాల నుంచి కొంత స్థలం ఇవ్వాలని ఎమ్మెల్యే రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రైతులు మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

బీఎల్‌ఓ కార్యాలయాలను సందర్శించిన ఆర్డీఓ

హయత్‌నగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉమర్‌ఖాన్‌గూడ, సంఘీనగర్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని బీఎల్‌ఓ కార్యాలయాలను ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి పరిశీలించారు. స్పెషల్ క్యాంపెయిన్ డేలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, ఓటర్ల తొలగింపు శనివారం, ఆదివారాలు బీఎల్‌ఓ కార్యాలయాల్లో నేరుగా చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. అందులో భాగంగానే కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, ఓటర్ల తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ఆర్డీఓ ఆయా బీఎల్‌ఓ కార్యాలయాలను పరిశీలించారు. అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి తుర్కయంజాల్, రాగన్నగూడ, తొర్రూర్ గ్రామాలలోని బీఎల్‌ఓ కేంద్రాలను పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తమ ఓటు హక్కును నేరుగా బీఎల్‌ఓ కార్యాలయంలో ఆదివారం లోగా దరఖాస్తు ఫారం నింపి నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో కూడా ఓటు నమోదు చేయించుకునే అవకాశం ఉందని తహసీల్దార్ తెలిపారు. జనవరి 6న ఫైనల్ ఓటర్ లిస్టు ప్రకటించడం జరుగుతుందన్నారు.



ఉమర్‌ఖాన్‌గూడ బీఎల్‌ఓ కేంద్రంలో ఓటర్ లిస్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

క్రికెటర్‌ను అవుతానని లెటర్ రాసి ఇంట్లో నుంచి పారిపోయిన విద్యార్థి ఆచూకీ లభ్యం



మంగ శ్రీశాంత్

వనస్థలిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తనకు చదువుమీద ఆసక్తి లేదని, తాను ఎప్పటికైన క్రికెటర్‌ను అవుతానని చెప్పి లెటర్ రాసి ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా విద్యార్థి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం డివిజన్ వెంకటరమణకాలనీకి చెందిన మంగ శ్రీశాంత్(15) ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. శ్రీశాంత్‌కు క్రికెటర్ అవ్వాలని కోరిక ఉండడంతో అతను సమయం దొరికనప్పుడల్ల క్రికెట్‌కు వెళ్తుండేవాడు. దీంతో ఎలాగైన పెద్ద క్రికెటర్ కావాలని, ఇంట్లో వాళ్లకు తాను క్రికెటర్ అవ్వడం ఇష్టం లేదని గ్రహించాడు. దీంతో నాకు చదువుమీద ఆసక్తి లేదు.. క్రికెటర్‌ను అవుతానని తాను రెండు సంవత్సరాల వరకు మీకు కనపడకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నానని లెటర్ రాసి శనివారం ఉదయం తన తండ్రి వెంకటేశ్ బైక్‌లో పెట్టి వెళ్లిపోయాడు. కాగా కళాశాలకు శ్రీశాంత్ రాలేదని కళాశాల సిబ్బంది శ్రీశాంత్ కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే శ్రీశాంత్ తల్లిదండ్రులు వనస్థలిపురం పోలీసులకు తన కొడుకు అదృశ్యమైనాడని ఫిర్యాదు చేశారు. తక్షణమే సీసీ కెమెరాలతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు అల్మాస్‌గూడ క్రికెట్ గ్రౌండ్‌లో శ్రీశాంత్ కనిపించడంతో పోలీసులు స్టేషన్‌కు తరలించి విద్యార్థి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ కొడుకును పోలీసులు అప్పగించడంతో శ్రీశాంత్ కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకుని, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న మునిసిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి

కొత్తపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని మునిసిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. న్యూనాగోల్‌లోని డాంగే భవన్‌లో శనివారం జిల్లా కార్మిక నాయకుడు ఎం మద్దిలేటి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వనంపల్లి జైపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి కార్మికులందరికి న్యాయం చేయాలన్నారు. కార్మికుల కనీస వేతనం రూ.26వేలు ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. విధి నిర్వహణలో మరణిస్తే కార్మికుల కుటుంబానికి రూ.25 లక్షలు ఆర్థిక సాయం అందించాలని, దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తర్వాత ఎల్‌బీనగర్ జోన్ మున్సిపల్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటయింది. సంఘం నూతన అధ్యక్షుడిగా జే.యాదమ్మ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా హంసమ్మ, ఉపాధ్యక్షులుగా వెంకటమ్మ, అంజయ్య, నందు, ప్రధాన కార్యదర్శిగా ఎం.మద్దిలేటి, సహాయ కార్యదర్శులుగా లక్ష్మమ్మ, కృష్ణవేణి, నర్సమ్మ, కోశాధికారిగా లక్ష్మి ఎన్నికయ్యారు.

కులగణనలో బ్రాహ్మణులుగానే నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న మునిపల్లె శ్రీనివాస్

ఎల్‌బీనగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణనలో బ్రాహ్మణులందరూ ఉపశాఖలకు అతీతంగా బ్రాహ్మణులుగానే నమోదు చేసుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ కోరారు. ఆర్‌కేపురంలో గ్రేటర్ హైదరాబాద్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల సంఖ్యాబలం నిరూపించుకోవాలంటే కులగణనలో కేవలం బ్రాహ్మణులుగానే నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి భాస్కరమూర్తి, ఉపాధ్యక్షులు బానగిరి నాగరాజు, కోశాధికారి రఘునందన్ పాల్గొన్నారు.

'ప్రతి కేంద్రం నుంచి వంద సభ్యత్వాలు చేయించాలి'

మన్సూరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): డివిజన్ల వారీగా ప్రతి పోలింగ్ బూత్ కేంద్రం నుంచి వంద మందికి పైగా బీజేపీ క్రియాశీల సభ్యత్వం నమోదు చేయించాలని బల్దియా మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సుభాషచందర్‌జీ ఎల్బీనగర్ నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, ప్రధాన నాయకులకు సూచించారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి ప్రారంభమైన బీజేపీ క్రియాశీల సభ్యత్వ సంఘటన పర్వ్ ప్రక్రియ చివరి దశకు చేరుకోవడంతో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, ప్రధాన నాయకులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుభాష్‌చందర్‌జీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్‌కు దేశంలో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా యావత్ దేశ ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తోందన్నారు. సమావేశంలో ఎల్బీనగర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, పవన్‌కుమార్, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం రవీందర్‌రెడ్డి, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రామేశ్వర్ నాంపల్లి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, గీతారెడ్డి పాల్గొన్నారు.

సర్వే మొదలాయె !

హయత్‌నగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో స్టిక్కరింగ్ పూర్తి చేసిన ఎన్యూమరేటర్లు శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీలో సమగ్ర సర్వే మొదలు పెట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులలో సర్వే మొదలైంది. ఒక్కొక్క ఎన్యూమరేటర్‌కు 150 నుంచి 170 వరకు ఇళ్లను కేటాయించారు. మున్సిపాలిటీలో 196 మంది ఎన్యూమరేటర్లు సర్వేలో పాల్గొంటున్నారు. 24 బ్యాచులుగా విడిపోయి పని చేస్తున్నారు. 19మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో సర్వే కొనసాగుతుంది. శనివారం ఒక్కొక్క ఎన్యూమరేటర్ ఐదు నుంచి పది వరకు ఇళ్ల సమగ్ర సమాచారాన్ని సేకరించారు. మొదటి రోజు కోడు, బుక్‌లెట్ చూసుకుని పనిచేస్తున్నందున కొంత ఆలస్యం జరుగుతుంది. సోమవారం నుంచి సర్వేవేగం అందుకునే అవకాశం ఉంది. దాదాపు 75 ప్రశ్నలకు సమాధానాలను సేకరిస్తున్నారు.



సమగ్ర సర్వే వివరాలను ఎన్యూమరేటర్లకు అందిస్తున్న టీపీసీసీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య



తట్టిఅన్నారంలోని బ్రీజీ వ్యాలీ కమ్యూనిటీలో సర్వేలో పాల్గొన్న కమిషనర్ రవీందర్‌రెడ్డి తదితరులు


పెద్దఅంబర్‌పేట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఎన్యూమరేటర్లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన సర్వే ఫారాలో స్టిక్కరింగ్ చేసిన ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులు పూర్తి వివరాలను ఫారంలో నమోదు చేశారు. మొదటి రోజు కావడంతో పూర్తి వివరాలు నమోదు చేసేందుకు కొంత సమయం పడుతుందని ఎన్యూమరేటర్లు తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో సర్వే ప్రశాంతంగా కొనసాగుతుంది.

అపోహలు వద్దు

- మీర్‌పేట్ మేయర్ దుర్గ

సరూర్‌నగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ఇంటి వద్దకు వచ్చే అధికారులకు, సిబ్బందికి అన్ని వివరాలు స్పష్టంగా తెలియజేయాలని మీర్‌పేట్ మేయర్ దుర్గాదీప్‌లాల్ ప్రజలకు సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో జరుగుతున్న సర్వేను శనివారం కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్‌తో కలిసి ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల ప్రజలకు ఈ సర్వే వల్ల ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వం చెబుతున్నందున ఆయా వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సర్వేలో పాల్గొనాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ వెంకన్న, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సూపర్‌వైజర్ రాజు, ఎన్యూమరేటర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మీర్‌పేట్‌లో కులగణన సర్వేను పర్యవేక్షిస్తున్న మేయర్ దుర్గాదీప్‌లాల్, కమిషనర్ జ్ఞానేశ్వర్

చంపాపేట : చంపాపేట డివిజన్‌లోని నేతాజీనగర్ కాలనీలో శనివారం సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను ఎన్యూమరేటర్లు చేపట్టారు. ఎన్యూమరేటర్లకు మెటీరియల్ ఆలస్యంగా అందడంతో సర్వే కొంత ఆలస్యంగా చేపట్టారు. కుటుంబ వివరాలను వారు అడిగి ఫామ్‌లోని కాలమ్స్‌ను పూర్తి చేశా రు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్-4 మాస్టర్ ట్రైనర్ హెచ్‌ఎం మంచిరెడ్డి అనంత రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎన్యూమరేటర్ కావ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- అవయవాలు దానం

హయత్‌నగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా అతని కుటుంబ సభ్యులు అవయవాలను దానం చేశారు. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజాపూర్‌లోని స్నేహపురికాలనీ నివాసి సంగిశెట్టి భాస్కర్(47) రామన్నపేటలో ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి మధ్యాహ్నం తన యూనికాన్ ద్విచక్ర వాహనంపై వెళ్లాడు.

తిరిగి రాత్రి 11.30గంటలకు ఇంటికి వస్తుండగా హయత్‌నగర్-ఇంజాపూర్ మధ్యలో ఉన్న లక్ష్మీప్రియకాలనీ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో భాస్కర్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108కు ఫోన్‌చేయగా వారు వచ్చి భాస్కర్‌ను ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించారు. నాటి నుంచి చికిత్స పొందుతున్న భాస్కర్ శనివారం సాయంత్రం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు భాస్కర్ అవయవాలను జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేశారు.